కథ

# నాణానికి అటూ ఇటూ

- వలివేటి నాగచంద్రావతి

తెల్లారి లేస్తూనే ఒంట్లో చిన్న నలత. కుడి వైపు వెనక దంతంలో కాస్త సలుపు... చెంపని ఎవరో చెళ్ళుమనిపించినట్టు కొద్దిగా వాపు.

లక్ష్యపెట్టకుండా రోజువారీ కార్యక్రమాలన్నీ పూర్తి చేసేశాను. ఇంటివాళ్ళ పనమ్మాయి మాణిక్యం తెచ్చిపెట్టిన టిఫిన్- గారె, పొంగలి తినేశాను. వేడివేడి కాఫీ తాగేశాను. నొప్పి రెట్టింపయ్యింది.

నెల్లాళ్ళక్రితం అపాయింట్‌మెంట్ ఆర్డరు తీసుకుని ఈ ఊరొచ్చాను. తెలిసినవాళ్ళ ద్వారా అద్దెగదిలో దిగాను. ఊరు కొత్త, పరిసరాలు కొత్త, వాతావరణం కొత్త.

ఏం చెయ్యటమిప్పుడు? ఆఫీసుకి టైమయి పోతోంది. జాయినైన కొత్తల్లోనే సెలవంటూ నాగా పెట్టడం మనస్కరించలేదు. అలాగే ఓర్చుకుంటూ బయల్దేరాను.

మా ఇంటి ఓనరు నా బుగ్గవాపు చూసను కుంటా "ఏమ్మా, పంటి నొప్పా?" అని పలక రించి, "నువ్వెళ్ళే సెంటర్‌లోనే మంచి డెంటల్ ఆసుపత్రుంది. చూపించుకుని మరీ వెళ్ళు" అని సలహా ఇచ్చాడు. రిజిస్టర్లో సంతకం చేస్తుంటే మా హెడ్‌గుమాస్తాగారు కూడా అదే అన్నారు- 'ఆ నొప్పితో ఏం పనిచేస్తావులే అమ్మా, డాక్టరుకి చూపించుకుని ఇంటికి వెళ్ళిపో ఈవేళ్టికి' అని.

ఆఫీసు ఉన్న రోడ్డుకి దగ్గర్లోనే ఉంది 'శ్రీకర్ మల్టీస్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్'. హాస్పిటల్ పెద్దది. పేషెంట్లు కూడా ఎక్కువ గానే ఉన్నారు. పళ్ళకి ఏఏ ట్రీట్‌మెంట్స్ చేయగలరో రాసిన బోర్డులూ అవి చేయక ముందూ చేసిన తర్వాత తీసిన ఫొటోలూ గోడలనిండా వేలాడదీసి ఉన్నాయి.

రిసెప్షన్‌లో అమ్మాయి "అపాయింట్ మెంటుందా?" అంది... అది లేకపోతే ప్రవేశం నిషిద్ధం అన్నట్టు జబర్దస్తీగా.

"ఉహు" అన్నాను.

"వీళ్ళంతా అపాయింట్‌మెంట్ తీసుకున్న వాళ్ళు. వీళ్ళు వెళితేగానీ మిమ్మల్ని పంపించం. చాలా ఆలస్యం అవుతుంది. దానికన్నా ఇప్పుడు మీ పేరు రిజిస్టర్ చేయించుకుని సాయంత్రం రండి" అని సలహా ఇచ్చింది.

ఉసూరుమంటూ వెనక్కి తిరిగాను. మెడికల్ షాపులో నొప్పి తగ్గటానికో టాబ్లెట్ కొనుక్కొని ఇంటికి తిరిగొచ్చాను. సాయంత్రం మాణిక్యం నా గదిలోకి వచ్చింది. ముడుచుకు పడుకున్న నన్నుచూసి జాలిపడింది. ప్రస్తుతానికి నా ఏకైక వెల్‌విషర్ అదొక్కటే. పొద్దున్న ఆస్పత్రికి వెళ్ళి తిరిగొచ్చేసిన సంగతి చెప్పి "ఇప్పుడు మళ్ళీ వెళ్ళాలి" అన్నాను నీరసంగా.

అది నా చెంపని పరిశీలనగా చూసింది. "ఇంత చిన్నదానికి అందాకా వెళ్ళటం ఎందుకమ్మా? ఈ పక్క చిన్నబజారుంది చూశారా - అక్కడ నాకు తెలిసిన పంటి డాక్టరుగారున్నారు. చాలా మంచోరు, రండి... నేను తీసుకువెడతా" అంది.

నా నొప్పిని చిన్నదే కదా అంటూ చులకన చెయ్యటం నాకు నచ్చలేదు. చిన్న ఆసుపత్రి చాలనటం అంతకన్నా నచ్చలేదు. అయిష్టంగానే ఉంది కానీ దాని మాటని కాదనలేకపోయాను.

చిన్నబజారు అనే ప్లేసు ఇక్కడికి చాలా దగ్గరే. నాలుగు మెడికల్ షాపుల మధ్యన ఏ ఆడంబరం లేకుండా చిన్నబోర్డుతో ఉందా పంటి ఆసుపత్రి. డాక్టరుగారు కూడా చాలా సాదాసీదాగా ఉన్నారు.

"గట్టి వస్తువేదో నమిలి ఉంటారు. నొప్పి చేసింది. అంతకన్నా ఏంలేదు" తేల్చేశారాయన.

"మందుబిళ్ళేదయినా..." అడిగింది మాణిక్యం.

"పచారీ దుకాణంలో పటిక అని దొరుకు తుంది. అది తెచ్చుకుని వేణ్ణీళ్ళలో వేసి కలుపు కుని రోజుకి నాలుగైదుసార్లు పుక్కిలి పట్టండి చాలు... తగ్గిపోతుంది" క్లుప్తంగా చెప్పారు. ఇక



వెళ్ళొచ్చు అన్నట్టు టేబుల్ సర్దుకుంటూ.

"మీ ఫీజు..." అన్నాను మర్యాదగా.

"మీకేం సర్వీసు చేశానని? అవసరంలేదు" అన్నారు నా మొహం చూడకుండానే.

ప్చ్, ఏమిటో ఫీజు తీసుకోని డాక్టరు... పటికనీళ్ళ వైద్యం. నాకాయన మితభాషిత్వం అంత నచ్చలేదు. ఆయన వైద్యంమీద గురికూడా కుదరలేదు.

కానీ చిత్రంగా ఆ పటికనీళ్ళతోనే మర్నాటి కల్లా చెంపకి వాపూ నొప్పీ తగ్గిపోయాయి. అప్పుడే జ్ఞాపకమూ వచ్చింది... ఆ క్రితంరోజు ఇంటివారి పాప తెచ్చిచ్చిన సాతాళింపు సెనగలు నములుతూ సెనగగింజంతే ఉన్న పలుకురాయి దంతంకింద పటుక్కుమనిపించి, 'అబ్బ' అంటూ చెంప నిమురుకున్న విషయం.

అప్పుడు కుదురుకుంది నా మనసులో ఆ డాక్టరుగారిమీద చిన్నపాటి గౌరవం.

★ ★ ★

నాల్రోజులు గడిచాయి. నేను కాస్త ఒత్తరి. దాన్ని అదుపులో పెట్టడానికి తనతోపాటు నాకూ నడక అలవాటు చేశారు నాన్న. ఈ ఊరు రావటం మూలంగా కామా పడిన నా వాకింగ్ అలవాటుని పునరుద్ధరించుదామని తెలతెలవారుతూండగా పార్కురోడ్డుకి వచ్చాను. నిన్న సాయంత్రమే చూశాను- పార్కు పక్కనే రోడ్డు. బావుంది. చివరిదాకా వెళ్ళి అక్కడున్న చిన్న ఫౌంటెన్ చుట్టేసి వెనక్కివస్తే చాలు... రెండు కిలోమీటర్లు నడిచొచ్చినట్టే.

నాలా చాలామందే వాకింగ్‌కి ఈ రోడ్డుని ఎంచుకున్నట్టుగా ఉంది. బ్రిస్కువాక్ చేస్తూనూ నడుస్తూనూ చాలామందే కనిపిస్తున్నారు. పార్కు దాటి పదడుగులు వేశాను. ఆ పక్క సందులోంచి ఈ రోడ్డుమీదకి వస్తున్నారాయన. మెడచుట్టూ మఫ్లరు, చేతిలో హ్యాండ్‌స్టిక్, చురుగ్గా పడుతున్న అడుగులు. చూడగానే గుర్తుపట్టాను... డాక్టరుగారు ఆయన.

అప్రయత్నంగా గబగబా నడిచి ఆయన్ని చేరుకున్నాను.

"నమస్కారం డాక్టరుగారూ."

ఆయన మొహంలో ప్రశ్నార్థకం. ఆయనతో నా పరిచ యాన్ని చెప్పుకున్నాను. గుర్తించినట్టు మందహాసం చేశారు. నేనాయనతోపాటు అడుగులు వేయటం మొదలుపెట్టాను. పెద్దవాడూ గౌరవనీయుడూ పక్కనుండటం నాకు సేఫ్టీ కదా.

నా అభిమతం గ్రహించినట్టున్నారు. నడక వేగం తగ్గించి నాకు సహకరించారు. ఆయన అడక్కపోయినా నా వివరాలు పొడిపొడిగా చెప్పాను మర్యాదకి. అవీ ఇవీ మాట్లాడుకుంటూ వాకింగ్ పూర్తిచేశాం. వాళ్ళ సందు దగ్గర విడిపోయాం.

నాకీ రోజనిపించింది... ఆయన మితభాషి కారనీ, చాలా బాగా మాట్లాడగలరనీ.

మర్నాడూ అదే టైము, అదే ప్లేసు. ఆయన చిరునవ్వు నన్ను పలకరించింది. తనతో నడవటానికి ఆహ్వానించింది. వారం గడిచేటప్పటికి ఎవరిరాక ఆలస్యమైనా వారికోసం రెండోవారం పార్కు బెంచీ మీద కూర్చుని నిరీక్షించడం అలవాటైంది.

ప్రభాతవేళ చల్లచల్లగా మొహాన్నితడిమే పిల్లవాయువుల్ని ఆస్వాదిస్తూ మెత్తని స్వరంతో ఆయన చెప్పే మాటలు వింటూ నడక సాగించటం- ఎవరో చెప్పినట్టు మంచి కాఫీ తాగిన అనుభూతి.

డాక్టరుగారు చదివింది బీడీయస్సేగానీ వ్యక్తిగతమైన అభిరుచితో ఆర్జించుకున్న విషయ పరిజ్ఞానం అపారం. పరిచయం పెరిగేకొద్దీ అది నాకర్థమైంది. కరెంట్ అఫైర్సేగాక ఎన్నో విశేషాలు చెప్పేవారాయన.

భుక్తికోసం ఈ ఊరొచ్చేదాకా అమ్మ కొంగు చాటున పెరిగిన ఆడపిల్లని. వారపత్రికల్లో సీరియల్స్ చదువుకోవటంతప్ప ఏ బరువైన సాహిత్యాల జోలికీ వెళ్ళెరగని సగటు అమ్మాయిని. ఆయన వేద వాఙ్మయంలోని గొప్పదనాన్నీ ఉపనిషత్తుల్లోని ఆత్మతత్వాన్నీ చెబుతోంటే ఆకళింపు చేసుకునే ప్రయత్నంలో సతమతమయ్యేదాన్ని.

చరిత్ర పరిణామాలూ నాగరికతా, శుచిగా ఎంతో మనమైన సూత్రాల పునాదులపైన ఆవిర్భవించిన మతాలూ మూఢాచారాల వెర్రితలలూ వివరించేవారాయన. ప్రబంధాలలోని భావసౌందర్యం, పురాణగాథల వెనక దాగిన వేదాంత రహస్యాలూ విప్పిచెప్పేవారు. అన్నిటికీ అతీతంగా హృదయాన్ని పులకింపజేసే లలితకళల గురించీ, అరవిందుడూ కృష్ణమూర్తి వంటి వారి తత్వాలూ ఉపదేశాలూ ఆయన ద్వారానే తెలుసుకున్నాన్నేను.

ఏది చెప్పినా సంగ్రహంలోనే సమగ్రంగా అర్థమయ్యేలా హత్తుకునేలా చెప్పగలిగే నేర్పు ఆయనది. రాజకీయాల పొలకువలకి మాత్రం వెళ్ళేవారు కాదు. 'అవి నాకు నచ్చవ్' అనేవారు.

ఏదేమైనా నేనాయనకి అభిమానినైపోయాను.

★ ★ ★

"ఆయన గురించి అంత మంచిగా చెప్పకో రమ్మా" నన్ను చూసి చదువుతున్న పేపరు మడుస్తూ అంటున్నారు మా ఇంటి ఓనరు.

"ఎవరి గురించంకుల్ మీరనేది?" ఆశ్చర్యంతో అడిగాను. వాకింగ్ పూర్తిచేసుకుని వస్తూవస్తూ పాలప్యాకెట్టొకటి తెచ్చుకుని అప్పుడే గదికొచ్చి తాళం తీయబోతున్నాను.

"ఆయనేనమ్మా ఆ డాక్టరు. ఈ చుట్టుపక్కల వాళ్ళందరూ ఆయనకి దూరంగా ఉంటారు. ఆదోరకం మనిషంటారందరూ. నువ్వాయన వెంబడి నడుస్తూండటం రెండుమూడుసార్లు చూశాను. చెప్పాలా వద్దా అని సందేహించాను కానీ ఊరుకోలేకపోయాను. ఏమీ అనుకోకమ్మా" అన్నారాయన మొహమాటపడుతూ.

"మంచిమాట చెప్పేందుకెందుకురా అబ్బాయ్ వెనకముందాడ్డం?" ఆ పక్కనే కూర్చుని ఆకు కూర బాగుచేసుకుంటున్న వాళ్ళమ్మగారు అందుకున్నారు. "ఆడికాదమ్మాయ్. పుకారు పుట్టినా వదంతి రేగినా నష్టపోయేదీ దెబ్బతినేదీ ఆడజాతే. గుర్తుంచుకో. పెళ్ళాం పిల్లల్ని ఇంట్లోంచి తరిమేసి అడ్డమైనవాళ్ళనీ చేరదీస్తాడని పేరుపడిపోయిందటా డాక్టరుకి. నువ్వా ఊరుకాని ఊరొచ్చిన ఒంటరి ఆడపిల్లవి. కుదురుగా నీ పనేదో నువ్వు చూసుకోక అలాటి సావాసమెందుకు చెప్పు. మసి అంటకుండా ఉండాలంటే. పొగచూరిన గోడకి దూరంగా ఉండాలి. పెద్దదాన్ని. ఎందుకు చెబుతున్నానో అర్థంచేసుకో అమ్మా, రేపు ఎటుపోయి ఎటొచ్చినా ఫలానా వారింట్లో ఉండే అమ్మాయి అని మా పేరు బయటకు వస్తుందని నా బాధ" అన్నదావిడ హితవుచెప్పిన అసలు కారణం వివరిస్తూ.

మతిపోతోంది నాకు. "సారీ, నాకివేవీ తెలీదు" గొణిగాను.

పెద్దావిడ ఇంకా చెబుతూనే ఉంది. డాక్టరు గారి భార్య భర్తపెట్టే టార్చర్ భరించలేక దేవుడా దేవుడా అంటూ కొంపవిడిచి వెళ్ళిపోయిందట. విదేశాలకి వెళ్ళి చదవాలని అభిలషించిన చెట్టంత కొడుకుని 'నీ ఫీజు నాకు లేదని' చెప్పేసి వెళ్ళగొట్టేశాడట. నలుగురేమనుకుంటే నాకేమిటన్నట్టిప్పుడు ఇష్టారాజ్యంగా గడిపేస్తున్నాట్ట.

వినే ఓపిక నశించిపోయింది. గదిలోకొచ్చి పడ్డానెలాగో. అప్పటి నా మనస్థితి ఇదమిద్ధమని ప్రత్యేకించి చెప్పలేను. అమాయకంగా ఉన్నదనుకొన్న రూపం గాడ్సేదని తెలిసినప్పటి షాక్‌లాంటిదది.

ఎంత గొప్పవాడని భ్రమపడ్డాను. మనస్సులో ఎంత ఉన్నత పీఠం వేశాను. ఆయన చెప్పే మాటల్లో ఎన్ని ఆదర్శాలు కురిసేవని. ఎంత సంస్కారం దొర్లేదని. అన్ని గ్రంథాలూ



తిరగేయటం, అన్ని న్యాయాలూ ధర్మాలూ తెలుసుకోవటం ఇతరుల దగ్గర వల్లించటంకొరకేనా - చేదుతిన్నట్టుగా ఉంది.

మర్నాటినుంచీ వాకింగ్ మానేశాను. నెల్లోపల గదీ మార్చేశాను. అంతేకానీ 'ఏమయ్యా, నీకిదేం బుద్ధి' అని ఆయన్ని నిలదీయాలని మాత్రం నేననుకోలేదు. చెప్పానుగా- నేనతి సామాన్యురాలయిన ఆడపిల్లనని.

★ ★ ★

"ఈరోజు నా బర్త్‌డే" చేతిలో ఓ ఫైవ్‌స్టార్ పెడుతూ అంది కిరణ్మయి.

ఆఫీసులో పనిచేసే ఆడవాళ్ళలో మేమిద్దరమే దగ్గర వయసువాళ్ళం. నేను చాలా మెతక. తను మహా చలాకీ. వ్యతిరేకదిశలవటంవల్లనుకుంటా మా ఇద్దరి మధ్యనా టచ్ ఎక్కువ.

"మెనీ మెనీ హ్యాపీ రిటర్న్స్ ఆఫ్ ద డే" చిరునవ్వుతో గ్రీటింగ్స్ చెబుతోంటే "సాయంత్రం ఓ చోటికి తీసుకెళతా వస్తావా?" అంది. తలూపాను.

అయిదు తర్వాత ఆటోలో బయల్దేరాం. తోవలో చెప్పింది 'వృద్ధాశ్రమానికి వెళుతున్నాం' అని.

మధ్యలో ఆగి స్వీట్సూ ఫ్రూట్సూ తీసుకుంది. పండగలప్పుడూ, ఇలా ఏదైనా విశేషమున్నప్పుడూ హోటల్స్‌కో పిక్నిక్‌స్పాటులకో వెళ్ళటం కంటే ఇలా ఆ వృద్ధులమధ్యనో అనాథపిల్లల దగ్గరో గడిపి రావటం తనకు చాలా తృప్తినిస్తుందట. ఎంత మంచి అలవాటు.

ఆశ్రమం అంటే నింగిని తాకే వృక్షాల మధ్య పర్ణశాలల్లాంటి ఇళ్ళుంటాయనుకుంటే పొరపాటే. పెద్ద బిల్డింగ్ అది. చుట్టూ బోలెడు ఖాళీ స్థలం. పద్ధతిగా పెంచుతున్న మొక్కలు.

"రామలక్ష్మిగారు తన సొంత ఆస్తి అమ్మేసి అన్ని వసతులతో కట్టించారు ఆశ్రమం కోసం" చెప్పింది కిరణ్. రామలక్ష్మిగారంటే ఈ ఆశ్రమాన్ని స్థాపించటమేగాక దీని నిర్వహణ కూడా తలకెత్తుకున్న వ్యక్తి అట.

"ఇంకోటి చెప్పనా- రామలక్ష్మిగారు మా అమ్మకి చిన్ననాటి స్నేహితురాలు. నేనావిడ్ని పిన్నీ అని పిలుస్తాను తెలుసా!" ఏదో గొప్ప విశేషం చెబుతున్నాననుకున్నప్పుడు కిరణ్ కళ్ళు మెరుస్తాయి. నవ్వుకున్నాను.

లోపలికి వెళ్ళాం. నేనేమనుకున్నానంటే జవసత్వాలు సన్నగిల్లి, మరణం కోసం ఎదురు చూస్తూ ముడుచుకు కూర్చున్న ముసలివారిని చూస్తాననుకున్నాను. కానీ లోపలి దృశ్యం వేరేగా ఉంది. ఓ ఉమ్మడి కుటుంబంలాగా వరసలతో పిలుచుకుంటూ కబుర్లాడుకుంటూనే పనులు చేసుకుంటూ, చేసుకోలేనివారికి చెయ్యందిస్తూ చీకూచింతా లేనట్టున్న వాళ్ళని చూస్తుంటే ఆశ్చర్యంగానే కాదు ఆనందంగా అనిపించింది.

"ఇదంతా మా పిన్ని దక్షత" అంది కిరణ్.

కిరణ్‌ని చూడగానే అంతా దగ్గరకొచ్చి పలకరించారు. "చాన్నాళ్ళయిందమ్మా నువ్వొచ్చి" అంటూ చేతులూ చెంపలూ తాకి ఆప్యాయత చూపించారు. 'చూశావా, నేనెంత పేమస్సో' అన్నట్టు కళ్ళెగరేసింది కిరణ్. తెచ్చిన స్వీట్సూ పళ్ళూ పంచిపెడుతూండగా "లక్ష్మితల్లికి ఒంట్లో బాలేదమ్మా" అన్నారెవరో.

కంగారుపడిపోయింది కిరణ్. "ఏంటీ, పిన్నికి బాలేదా, పదపద..." అంటూ చేతిలో మిగిలిన వన్నీ ఇంకొకరి చేతిలో కుక్కి నా చెయ్యి పట్టుకుని లాక్కుపోయింది గబగబా.

బిల్డింగ్ వెనకవున్న ఔట్‌హౌస్‌లో ఉంటున్నారట రామలక్ష్మిగారు. మేం వెళ్ళేసరికి మంచం ఆనించివున్న గోడకి దిండు వాలుగా వేసుకుని కూర్చుని ఉన్నారావిడ. కాషాయరంగు కాటన్ చీర, మెడలో రుద్రాక్షలు, నుదుట ఎర్రని కుంకుమ. ఏ ఆభరణమూ ధరించకపోయినా మొహంలో విరిసిన సౌమ్యత కారణంగా సర్వాలంకృతమైనట్టుగా ఉన్నారామె.

వెళ్తూనే నిష్టూరాలాడ్డం ఆరంభించింది కిరణ్- తనకి ఫోనయినా చేయలేదేమని. మందహాసం చేశారు రామలక్ష్మిగారు. "కొంచెం జ్వరం. దానికెందుకంత కంగారు" అన్నారు మెత్తగా.

రెండు కుర్చీలు మంచానికి దగ్గరగా లాక్కుని కూర్చున్నాం. పరస్పరం పరిచయాలు చేసింది కిరణ్.

"తను నా ఫ్రెండ్ ఉష. ఈమె మా పిన్ని రామలక్ష్మిగారు. ఈవిడ్ని గురించి మా అమ్మ ఏమంటుందంటే- కళ్ళలో పెట్టుకుని చూసుకునే భర్త, బంగారం లాంటి కొడుకు, ఏ లోటూలేని

ఇంచక్కటి సంసారంలో హాయిగా సుఖపడలేక పనిమాలా 'ఆశ్రమం, వృద్ధులూ' అంటూ ఇంత పెద్ద కుటుంబాన్ని సేకరించుకుని మరీ నెత్తికెత్తుకు మోస్తోందట ఈవిడ" అని ఆగి, "ఏం పిన్నీ, సరిగ్గానే చెప్పానా? " అంది ఆవిడ కేసి తిరిగి.

తెచ్చిపెట్టుకున్న కోపంతో కసిరినట్టు చూసి అంతలోనే నవ్వేశారు. "నేను వాళ్ళని బరువను కోవటంలేదమ్మా. చిన్నప్పుడు అమ్మమ్మన్నా, బామ్మా తాతయ్యలన్నా చాలా ఇష్టంగా ఉండేది. ఎప్పుడూ వాళ్ళతోనే ఉండిపోవాలని ఎంతో ఆశపడేదాన్ని. అప్పుడలా కుదరింది కాదు. ఇప్పుడీ వృద్ధుల్లో వాళ్ళని చూసుకుంటూ ఆ కోరికని తీర్చుకుంటున్నానంతే" తేలిగ్గా అన్నారావిడ నాతో.

కాస్త నీరసంగా ఉన్నా ఆవిడ మొహంలో ఎంత ప్రశాంతత! గడుపుతోన్న జీవితంపట్ల గొప్ప సంతృప్తి పొందుతున్నవారి మొహంలో కనబడే ప్రశాంతత అది. పూజకోసమే పూసిన దేవపారిజాతంలా పవిత్రంగా కనిపిస్తోన్న ఆమెను పదేపదే చూడాలనిపిస్తోంది నాకు.

"గుడీవినింగ్ కిరణ్, హౌవ్వార్యూ? "

పరిచితమైన కంఠస్వరం. చటుక్కున పక్కకి తిరిగాను. చేతిలో ట్రే, ట్రేలో గ్లాసు - పక్కనున్న కిచెన్‌లోనుంచి వస్తున్నారాయన. ఎవరు..? డాక్టరుగారు. నిర్ఘాంతపోయాను.

"గుడీవినింగ్ అంకుల్. మీరెప్పుడు వచ్చారు? అనుకుంటూనే ఉన్నాను స్మీ. ఈవిడగారికి ఒళ్ళొచ్చుబడితే మీకు కాకితో కబురందిపోదా. ఆమైన రెక్కలు కట్టుకు వాలిపోరా మీరని" అంటోంది కిరణ్ అల్లరిగా.

జావగ్లాసు రామలక్ష్మిగారికందిస్తూ "ఏం చెయ్యమంటావ్ చెప్పు. ఈవిడైతే కాషాయం కట్టుకుని నన్నొదిలేసిందిగానీ నేనింకా పట్టుకుని పాకులాడుతూనే ఉన్నాను" అని నవ్వారు.

అప్పుడు చూశారు నన్ను "అరె నువ్వా? మా కిరణ్ ఫ్రెండువి నువ్వేనా? బావున్నావా అమ్మా" అన్నారు.

ప్రయత్నంమీద తలాడిస్తూ నవ్వగలిగాను.

"పిల్లల దగ్గర ఏమిటా మాటలు? " కోప్పడుతున్నారప్పటికే రామలక్ష్మిగారు.

"అవును ఆంటీ... మీరూ అంకుల్ దగ్గరే ఉండొచ్చుగదా. ఒంటరిగా ఎందుకిలా..." సందేహిస్తూనే అడిగాను చనువు తీసుకున్నట్టుగా.

సాలోచనగా చూశారామె. "కొన్నాళ్ళు అదీ చూశానమ్మా. ఊహూ... రెండు పడవలమీద రెండు కాళ్ళుంచి ప్రయాణం - నాకది తృప్తినివ్వ లేదు. ఇరువైపులవారికీ న్యాయం చేయలేకపోతున్నానే అని బాధ. ఓ నిర్ణయానికి వచ్చాను. ఈయన అనుమతి ఇచ్చారు. ఇక్కడికి వచ్చేశాను. మనస్సు చంచలం కాకుండా ఉండాలని ఈ కాషాయం కట్టుకున్నాను" చెప్పారామె మెల్లగా ఆ తర్వాత.

"అదండీ సంగతీ" కిరణ్‌కి సీరియస్‌గా ఉండటం అస్సలు చేతకాదు.

"మీక్కొంచెం టీ కలుపుకు వస్తాను" డాక్టరుగారు తిరిగి కిచెన్‌లోకి వెళ్ళిపోయారు.

సాయానికి కిరణ్ కూడా వెంటవెళ్ళింది.

రామలక్ష్మిగారు ఆశ్రమం విశేషాలు చెబుతున్నారు. వింటూవింటూ యథాలాపంగా అడిగినట్టడిగాను. "మీకో అబ్బాయి ఉన్నాడు కదా ఆంటీ? "

"అవునమ్మా. చైతన్య. హైదరాబాద్‌లో జాబ్ చేస్తున్నాడు."

కాస్త జంకుగానే ఉన్నా చొరవచేసి అడిగాను. "మీ అబ్బాయి మీ కాంటాక్ట్‌లోనే ఉంటాడా ఆంటీ" అని.

నుదురు చిట్లించారావిడ. "ఏమిటలా అడిగావ్? "

నేను తడబడ్డాను. అదృష్టం బావుంది. అప్పుడే కిరణ్ ట్రేతో టీకప్పులు పట్టుకొస్తూంది. నా ప్రశ్న వింది గావును. "టచ్‌లో ఉండటమా - భలేదానివే, నెలకోసారి వచ్చేసి, వాళ్ళమ్మ చేతి ముద్దలు తినిపోతాడా అమ్మకూచి. నీకు తెలీదు ఉషా, అమ్మనీ నాన్ననీ విడిచిపెట్టుండలేక హయ్యర్‌స్టడీస్‌కి స్టేట్స్‌లో సీటు వస్తే వెళ్ళటం మానేశాడు చైతన్య. చెప్పు, అంత అమాయకులుంటారా ఎక్కడైనా" అంటూ సమాధానం తను చెప్పి నా ఇబ్బంది తప్పించేసింది.



నా అనుమానమూ తీర్చేసింది.

"అది మీకు చెప్పే కారణం కిరణ్. నిజమది కాదు" సరిగా కూర్చుంటూ అన్నారు రామలక్ష్మిగారు. "ఆశ్రమం కన్‌స్ట్రక్షన్‌లో ఉందప్పుడు. తన ఫీజుకీ పైఖర్చుకీ లక్షల్లో డబ్బవసరం. 'ఆశ్రమం కట్టుబడి ఆపటమా, చైతన్యని నిరాశపరచటమా' అని చాలా నలిగిపోయాం ఆయనా నేనూ.

చైతన్య మాత్రం క్షణాల్లో నిర్ణయానికి వచ్చేశాడు. 'నా లక్ష్యంకన్నా నీ లక్ష్యం గొప్పదమ్మా' అని తేల్చేశాడు. ఇక్కడే చదువు పూర్తిచేసి జాబ్‌లో జాయినైపోయాడు. తను మిగిల్చింది కూడా ఈ ఆశ్రమానికే ఇచ్చేస్తుంటాడు నా బిడ్డ." రాగబంధాలకి అతీతంగా ఉండాలని ఎంత సాధన చేస్తున్నా కొడుకు త్యాగగుణం తలుచుకోగానే తెలియకుండానే మమకారం పొంగి వెలుగులా మారి ఆమె మొహమంతా పరుచుకుంది.

డాక్టరుగారి వదనం మీద కూడా పుత్రోత్సాహం, పిసరంత గర్వరేఖ.

"అసలు ఈ అమ్మాకొడుకుల పైత్యాలకి మూలకారణమెవరో తెలుసునా... ఇదుగో ఈ మహానుభావుడు. 'మనకు భగవంతుడిచ్చిన శక్తిమేరకు ఇతరుల బాధానివారణ చేయటంలోనే ఈ జన్మకు సార్థకత', 'మానవ సేవంటే మాధవసేవే', 'ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటే దేవుడికి నైవేద్యం పెట్టినట్టే'... ఇలాంటి పనికిమాలిన సుద్దులన్నీ వీళ్ళ బుర్రల్లోకి కూరికూరి పాడుచేసి పారేశారు" డాక్టరుగారికేసి వేలు చూపిస్తూ కినుకగా అంది కిరణ్.

మందహాసం చేశారు వాళ్ళిద్దరూ.

టీ పూర్తయింది. కబుర్లతో కొంత సమయం గడిచింది. వెళ్ళటానికి లేచాం. సాగనంపేందుకు మావెంటే వచ్చారు దంపతులిద్దరూ. ముందు కిరణ్ రామలక్ష్మిగారూ, వెనక నేనూ డాక్టరుగారూ.

"మీమీద ఎన్నో నిందారోపణలున్నాయి ఆ చుట్టుపక్కల, మీకు తెలుసా? " హఠాత్తుగా అడిగాను స్వరం తగ్గించి.

"తెలుసు" అన్నారు డాక్టరుగారు తాపీగా. "ఆ ఆరోపణలు నిజమే కూడా."

"నిజమా" తెల్లబోయాను.

"ఔను ఉషా, అడిగేదేదో సరియైనచోటే అడిగావు. అదిగో ఆ ఆఫీసుగది కిటికీలోంచి చూడు - ఆ లెడ్జరు తిరగేస్తున్న అమ్మాయి సుచరిత. ప్రహరీపక్కన క్రోటన్స్ కత్తిరిస్తున్న పాప వల్లి. వంటగదిలో ఉండుంటుంది నవనీతమ్మ. ఇంకా ఒకరిద్దరున్నారు వేరే పనుల్లో. వీళ్ళూ ఆంటీ అక్కౌంట్‌లో వాళ్ళు కాదు. నా పద్దులోనివాళ్ళు" అంటున్నారాయన కులాసాగా.

"డాక్టరుగారూ"

"నేను చెప్పింది నిజమే ఉషా. ఈ వల్లికి సవతితల్లి వాతలు పెడుతుంది. ఆ సుచరిత గౌరవంగా బతకాలనుకుంటున్న ఓ అనాథ వితంతువు. ఇక నవనీతమ్మ భర్త పచ్చితాగుబోతు. భార్యని చిత్రహింస పెడతాడు. పిల్లల నోటిదగ్గర ముద్ద కూడా లాక్కుపోతాడు. ఈ శాపగ్రస్తుల్ని నేను చేరదీసింది. వాళ్ళ బాధలకి ఉపశమనం వెతకాలన్నదే నా తాపత్రయం."

నా సందేహానికి సమాధానం ఇంకా సశేషంగానే ఉంది.

"ఇక నువ్వు విన్న పుకార్లంటావా... నిజాల్ని కప్పి ఉంచాల్సిన అవసరం కొందరిది. వాళ్ళు సృష్టించిన కథలకి చిలవలూ పలవలతో ప్రచారం చేసే నైజం ఇంకొందరిది. చైతూ చదువు ఆపేయటం, ఆంటీ ఇక్కడకు వచ్చేయటం వారి వక్రభాష్యానికి ఇంకాస్త బలం" అని ఆగి, తిరిగి మెత్తగా అన్నారు "ఒకరిని గాయపరచటంకంటే ఆ నొప్పికి మందు రాయటంలోనే అపరిమితమైన మానసిక ఆనందం దొరుకుతుందని తెలీని అమాయకులమ్మా వాళ్ళు. వాళ్ళని చూసి జాలిపడ్డంతప్ప, మరేం చేయగలం చెప్పు."

ఆగ్రహం, అసహనం కనబరచాల్సినచోట శాంతం, ప్రేమ. ఆయన్ని చూస్తుంటే అపురూపమనిపించింది.

ఏదేమైనా డాక్టరుగారు నిష్కళంకులు. హృదయం ఎందుకో చాలా తేలిగ్గా ఉంది. పున్నాగపూల చెట్టుకిందనుంచి మా నడక. ఆ చెట్టుని ఉత్సాహంగా ఊపాను. జలజలా రాలాయి పూలు.

"రా, రా... ఆటో వస్తోందిటు" గేటు దగ్గర నుంచుని పిలుస్తోంది కిరణ్.

నేను వంగి డాక్టరుగారి కాళ్ళకు నమస్కరించి ముందుకు నడిచాను. ★